ఆరోగ్యానికి 'ఆయుష్మాన్' భవ

- గొటివాడ కేంద్రం సేవలు భేష్
- జిల్లాలో రెండో స్థానంలో నిలిచిన వైనం

గ్రామ జనాభా : **3,153** మంది
ప్రతి రోజు కేంద్రంలో సగటును
ఓపీకి వచ్చే రోగులు : **15** మంది


కేంద్రంలో ఓపీ చూస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రెడ్డి శిరీష (ఫైల్)


ఇటీవల ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర బృందం సభ్యులు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సబ్బవరం : గ్రామీణ ప్రజలకు ఆరోగ్యానికి పూర్తి భరోసా కల్పించేలా సచివాలయ స్థాయిలోనే వైద్యం అందేలా కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను ఏర్పాటు చేసింది. దీంతో ఆయా కేంద్రాల పరిధిలో అన్ని రకాల వైద్య పరీక్షలు, చికిత్సలను అందుబాటులోకి వచ్చాయి. వైద్య సేవల కోసం దూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకపోవడంతో ఆర్థిక భారం తప్పింది. ఆరోగ్య సమస్య తీవ్రం కాకముందే సరైన సమయంలో గుర్తించి చికిత్స అందిస్తుండడంతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లక్ష్యాలను తక్కువ కాలంలోనే చేరుకున్నాయి. గోటివాడ సచివాలయం పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో ఒక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌తో పాటు ఒక ఏఎన్ఎమ్, ఒక హెల్త్ అసిస్టెంట్‌తో పాటు ముగ్గురు ఆశావర్కర్‌లు పనిచేస్తారు.

జిల్లాలో రెండో స్థానంలో నిలిచిన 'గొటివాడ'

గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో మండలంలోని గొటివాడ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. గత నెల 4వ తేదీన ఎన్‌కాస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్) ప్రొగ్రామ్‌లో భాగంగా ఢిల్లీ నుంచి డాక్టర్ రాజేశ్వర్,డాక్టర్ జయలక్ష్మి బృందం ఆయుష్మాన్ కేంద్రాన్ని సందర్శించింది. రోగులతో మాట్లాడి కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీయడంతో పాటు రికార్డుల నిర్వహణను తనిఖీ చేసింది.

గ్రామంలోని పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించింది. గొటివాడ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవలను గుర్తిస్తూ జిల్లాలో రెండో స్థానం పొందినట్టు బుధవారం కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

కేంద్రంలో లభించే సేవలు

- సమగ్ర మాతృ ఆరోగ్య సంరక్షణ సేవలు
- సమగ్ర నవజాత,శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు
- పిల్లలు,కౌమార దశ బాల బాలికలు ఆరోగ్య సంరక్షణ సేవలు
- సమగ్ర గర్భ నిరోధక, కుటుంబ నియంత్రణ సేవలు
- పునరుత్పత్తి ఆరోగ్య సేవలు
- అంటువ్యాధుల నియంత్రణ,నివారణ
- ప్రాథమిక కంటి ఆరోగ్య పరీక్షలు
- చెవి,ముక్కు, గొంతు సేవలు
- మానసిక ఆరోగ్య సమస్యలు

క్లుప్తంగా

ఫార్మా వ్యర్థాలపై ఆందోళన


కాలువ ద్వారా ప్రవహిస్తున్న వ్యర్థ జలాలను పరిశీలిస్తున్న ప్రజలు, సీఐటీయూ నాయకులు

పరవాడ: ఫార్మా వ్యర్థ రసాయనాలను కాలువల ద్వారా విడుదల చేయడం అరికట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తాడి గ్రామ సమీపం నుంచి కాలువ ద్వారా విడుదల చేసిన వ్యర్థరసాయనాలను అక్కడి ప్రజలు గురువారం గుర్తించి ఆందోళనకు దిగారు. కాలువ ద్వారా ప్రవహిస్తున్న వ్యర్థ రసాయనాలను సీఐటీయూ నాయకులు, ప్రజలు గురువారం గుర్తించారు. కాలుష్యంతో ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాడి సమీపం నుంచి ప్రవహిస్తున్న వ్యర్థరసాయనాలు ఏలేరు కాలువలో కలిసే అవకాశాలు అధికంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గల్లా భార్గవ్, కోమటి గురుమూర్తి, శ్రీను బాలాజీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం : మరమ్మతులు కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్‌శాఖ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. సింహపురికాలనీ ఫేజ్ 1, 2, సింహాచలం, ప్రియాగార్డెన్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

అప్పన్న దేవస్థానానికి రూ.2 లక్షల విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం విశాలాక్షినగర్‌కు చెందిన ఎస్.నాగేశ్వరరావు రూ.లక్ష 116 రూపాయల విరాళాన్ని, చందన సమర్పణకు మరో రూ.లక్ష 116ల విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో అందజేశారు. దేవస్థానం తరపున ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి దాతకు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అందజేశారు.

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

మధురవాడ : ఈ నెల 8న నిర్వహించే పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికకు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమౌతుందన్నారు. ఇక్కడ ప్రతీ తరగతికి ముగ్గురు చొప్పున సభ్యులను ఎన్నుకుంటారన్నారు. తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్, ఎక్స్ అఫీషియో, కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ఉంటుందన్నారు. ఇప్పటికే ఎన్నికలు గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు నోటీసులు పంపిణీ చేశామని చెప్పారు.

స్పీడ్ బ్రేకర్లకు పెయింటింగ్


స్పీడ్ బ్రేకర్లకు పెయింటింగ్ వేస్తున్న యువకులు

కొమ్మాది : జీవీఎంసీ 6వ వార్డు కే 1, కే 2, కే 3 కాలనీల్లో స్పీడ్ బ్రేకర్లకు యువకులు గురువారం పెయింటింగ్ వేశారు. ఈ బ్రేకర్లకు పెయింటింగ్, రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు గమనించకపోవడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై స్థానికులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో కాలనీ ప్రెసిడెంట్ అవతార్‌సింగ్ చొరవ తీసుకుని గురువారం స్థానిక యువకుల సహాయంతో 5 చోట్ల ఉన్న స్పీడ్ బ్రేకర్లకు పెయింటింగ్ వేయించారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబరాలు


వర్గీకరణ తీర్పుతో సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సబ్బవరం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నేతలు పేర్కొన్నారు. సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఒకరికొకరు మిఠాయిలు పంచుకున్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునివ్వడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోటివాడ సామ్రాట్ కుమార్ పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌ను వర్గీకరించడంతో మాదిగలు అభివృద్ధి పథంలో పయనిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం మాదిగలకు నిజమైన స్వాతంత్ర దినోత్సవంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఇందుగుబిల్లి గోపి, మండల కన్వీనర్ బోర్రా జయరాజు, దువ్వి దుర్గాలు, గోటివాడ సన్యాసి, కోటి అప్పారావు, మారేడుపూడి కోటి, నీటిపల్లి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం


తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కనకప్పారావు


పరవాడలో తల్లిపాలపై ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

పరవాడ: తల్లులు శిశువు పుట్టిన ఒక గంటలోపు నుంచే తల్లిపాలు ఇవ్వడం ప్రారంభించాలని వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కనకప్పారావు పేర్కొన్నారు. మొదటి 6 నెలలు వరకు పిల్లలకు తప్పకుండా తల్లిపాలు ఇవ్వాలి. శిశువుకు రెండేళ్ల వరకు పాలను కొనసాగిస్తూనే సురక్షితమైన ఆహారాన్ని తినిపించే ప్రయత్నం చేయాలన్నారు. అప్పుడే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వాడచీపురుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి జయశ్రీ కరిష్మా అన్నారు. పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం పరవాడలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు జయశ్రీ కరిష్మా మాట్లాడుతూ నవజాత శిశువుకు పుట్టిన గంటలోనే తల్లిపాలను తాగించాలని సూచించారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లికి గర్భాశయం సాధారణ స్థితికి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ అధికారి ఎం.ఎస్.ఎస్.సాయిరాం, స్టాఫ్‌నర్స్ చైతన్య, ఫార్మసిస్టు విజయకుమారి, సిబ్బంది అన్నపూర్ణేశ్వరి, ఎం.శ్రీనివాస్, ఆశాకార్యకర్తలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

సబ్బవరం: మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు నాణ్యమైన, ఆరోగ్య వంతమైన దిగుబడులను పొందడానికి అవకాశం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి డి.మోహన్‌రావు తెలిపారు. సబ్బవరంలోని స్థానిక జాగృతి కార్యాలయంలో జాగృతీ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత ఆధ్వర్యంలో పొలంబడి కో ఆర్డినేషన్ సమావేశం గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులకు,రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు,సేంద్రియ వ్యవసాయ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనకాపల్లి , సబ్బవరం, చోడవరం, పరవాడ, యలమంచిలి, పాయకరావుపేట మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో మాంగళ్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చనను విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేంపజేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహించారు. విశేషంగా హారతిలు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేంపచేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాన్ని విశేషంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం , శేషవస్త్రాలను అందజేశారు.

ఔషధ మొక్కల పెంపకం ఆరోగ్యానికి మేలు

మద్దిలపాలెం: ఖాళీ ప్రదేశాల్లో ఔషధ మొక్కలను పెంచడం వల్ల ఆర్యోగానికి మేలు చేకూరుతుందని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల ప్రాంగణంలో గురువారం గ్రీన్ క్లైమేట్, వనమాలి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో జీవన వైవిధ్య వనం పెంచుదామని, ఇందుకు విద్యార్థుల సహాయ, సహకారాలు ఎంతో అవసరమన్నారు. భవిష్యత్ తరాల కోసం సామాజిక వనాలు పెంచాలన్నారు. ఆరోగ్యంగా ఉండడానికి ప్రకృతి ఆధారిత వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేశీయ విత్తనాల నిధిని ఏర్పాటు చేయడానికి గ్రీన్ క్లైమేట్, వనమాలి స్వచ్ఛంద సంస్థల కృషి ప్రశంసనీయమన్నారు. మొక్కలు పెంచడం ద్వారా పక్షులు గూళ్ల పెట్టుకుని వాటి మనుగడ సాధిస్తాయన్నారు. ఆకుకూరల పెంపకాన్ని ఇంటి పెరట్లో చేపడడం ద్వారా తాజా ఆర్గానిక్ ఆకుకూరలు తినేందుకు వీలు కలుగుతుందన్నారు. వనమాలి సంస్థ ప్రతినిధులు మళ్ల సరిత, ఎ.అరుణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామారావు స్ఫూర్తితో 'ఉక్కు' పరిరక్షణ



వి.వి.రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: ఉక్కు పరిరక్షణకు పోరాట యోధుడు వి.వి.రామారావు స్ఫూర్తితో ముందుకు వెళ్తామని ఉక్కు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు గురువారానికి 1267వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఏఐటీయూసీ జాతీయ నాయకుడు వి.వి.రామారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ పోరాటాలకు రామారావు స్ఫూర్తిని కల్గించేవారన్నారు. ఆయన బాటలో పయనించి విశాఖ ఉక్కును కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.సత్యనారాయణరావు, మసేనురావు, డొక్కా నరసింగరావు, కె.రాజబాబు, జి.జయ, డి.దేముడు, కనకరాజు, బీఎంఎల్ నాయుడు, సీతారామరాజు, రమేష్, కార్మిక సంఘాల నేతలు విల్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- డీసీపీ-2 తుహిన్ సిన్హా
- దువ్వాడ పీఎస్ ఆకస్మిక తనిఖీ


దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, కేసుల వివరాలు పరిశీలిస్తున్న డీసీపీ-2 తుహిన్ సిన్హా

అగనంపూడి: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నగర డీసీపీ-2 తుహిన్ సిన్హా ఆదేశించారు. ఈ ప్రాంతాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దాలని, నేరాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. దువ్వాడ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన అక్కడి సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి, కేసులపై ఆరా తీశారు. సమస్యాత్మక ప్రాంతాల వివరాలపై వాకబు చేశారు. అనంతరం అగనంపూడి సెక్టార్లలో కలియ తిరిగారు. అక్కడ ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. కూర్మన్నపాలెం, వడ్లపూడి, దువ్వాడ, మంగళపాలెంతో పాటు దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో భూ వివాదాలు లేకుండా చూడాలని, అధికంగా నేరాలు జరిగే ప్రాంతాల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. ఆయన వెంట దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు ఉన్నారు.

దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ప్రారంభం


తేరు స్వరూపాన్ని ప్రారంభిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) ఆధ్వర్యంలో శతాబ్దం నుంచి నిర్వహిస్తున్న దేవమాత మోక్షారోపణ ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ నేతృత్వంలో దివ్య బలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరియమాత ఏ విధంగా లోకానికి తల్లిగా మారిందో విశదీకరించారు. ముందుగా శిలువ గుర్తు వీధిలో దేవమాత పతాకాన్ని పీపీసీ అధ్యక్షుడు మునురు రాజేషబాబు ఆవిష్కరించారు. అనంతరం సెబాస్టియన్ కాలనీ, బిషప్ మరియదాస్ కాలనీ, రావులపల్లి, వడిచర్ల, నికోలస్, దయాస్, రాసా వీధుల్లో తేరును ఊరేగించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు వినయ్‌కుమార్, ఆంథోనీ రాజ్, ఆంధ్రా క్యాథలిక్ యూనియన్ ప్రెసిడెంట్ బూర శేషుబాబు, పీపీసీ సభ్యులు పి.ఫ్రాన్సిస్, జి.ఆనందరావు, నిర్మల రాజు, రత్నం, గురు మండలి సలహా సంఘం ప్రతినిధులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

వెటరన్ చాంపియన్

- అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న ఉక్కు ఉద్యోగి వరప్రసాద్
- కోచ్‌గా పలు జట్లకు మార్గనిర్దేశం
- రాష్ట్ర వెటరన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సేవలు
- ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్


గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న వరప్రసాద్


జాతీయ స్థాయి విజేతలతో వరప్రసాద్

ఉక్కునగరం: క్రీడల్లో ఆసక్తి ఆయన్ను ఐదు పదుల వయసు దాటినా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనేలా చేస్తోంది. కోచ్‌గా ఎందరో క్రీడాకారులకు మార్గదర్శకత్వం ఇచ్చేందుకు దారి చూపింది. చదువును, క్రీడలను, కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకుని సక్సెస్‌ఫుల్ అథ్లెట్‌గా, వెటరన్ చాంపియన్‌గా నేటికీ తరగని ఉత్సాహంతో దూసుకుపోతున్నారు స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగం సీనియర్ మేనేజర్ మంగ వరప్రసాద్. పాఠశాల స్థాయిలో హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు సొంతం చేసుకున్న ఆయన కాలేజీలో ప్రవేశించాక అథ్లెటిక్స్‌లో ప్రవేశించి కాలేజ్ చాంపియన్, జిల్లా చాంపియన్ అయ్యారు. ఆటలతో పాటు చదువుపై దృష్టి సారించి ఏయూ నుంచి ఎంఏ (పాలిటిక్స్), ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్), ఎంఏ (సోషియాలజీ)లో పట్టాలు అందుకున్నారు. అన్నామలై యూనివర్సిటీ నుంచి పర్సనల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్‌లో డిప్లమో చేయడంతో పాటు ఏయూ నుంచి బీఎల్ డిగ్రీ అందుకున్నారు. ప్లాంట్‌లో చేరిన నాటి నుంచి అనేక పోటీల్లో పాల్గొంటూ బహుమతులు సొంతం చేసుకున్నారు.

సాధించిన విజయాలివీ..

- వరప్రసాద్ 1984 నుంచి 1987 వరకు ఆల్ ఇండియా యూనివర్సిటీ 5కే, 10కే, 1500 మీటర్లు రన్నింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.
- 1986-87లో స్టేట్ లెవెల్ పోటీల్లో 5 వేల మీటర్ల రన్నింగ్‌ను 15.17 సెకన్లలో ముగించి స్టేట్ రికార్డ్ నెలకొల్పారు.

అథ్లెటిక్ కోచ్‌గా..

గత 25 ఏళ్లుగా స్టీల్‌ప్లాంట్ అథ్లెటిక్ కోచ్‌గా అనేక పోటీలకు టీమ్‌లను సిద్ధం చేయడం, పతకాలు సాధించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. 2010లో వెటరన్ అథ్లెటిక్స్‌లో ప్రవేశించి జిల్లా జట్టును తయారు చేయడంతో పాటు జిల్లా అసోసియేషన్‌కు కార్యదర్శిగా ఎదిగారు. గత పదేళ్లుగా రాష్ట్ర వెటరన్ పోటీల్లో విశాఖ జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించేందుకు కృషి చేస్తున్నారు.

- 2014లో రాష్ట్ర వెటరన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై రాష్ట్ర జట్టులో కీలకంగా వ్యవహరిస్తున్నారు.
- 2012లో శ్రీలంకలో, 2016లో బ్యాంకాక్‌లో, 2018లో మలేసియాలో జరిగిన అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఇండియా తరపున పాల్గొన్నారు. మలేసియాలో జరిగిన పోటీల్లో హై జంప్‌లో కాంస్య పతకం గెలుపొందారు.
- 2018లో నకాస్ సవాస్, 2019లో కౌలాలంపూర్, 2022లో శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ పోటీలకు ఆయన ఇండియా జట్టు మేనేజర్‌గా హాజరయ్యారు.
- ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆయన సేవలను గుర్తించి 2024 జూలైలో తమిళనాడు హోసూరులో జరిగిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.

అందరి సహకారంతో..



ఆటలపై నాకున్న ఆసక్తిని అమ్మ నాన్న గమనించి ప్రోత్సహించారు. ఆ తర్వాత కాలేజీ, యూనివర్సిటీలోని క్రీడాధికారులు, స్టీల్‌ప్లాంట్‌లో నా అధికారులు, యాజమాన్యం అందించిన సహకారంతోనే ఈ విజయాలు సాధించగలిగాను. నా జీవితం చివరి వరకు అథ్లెటిక్స్ కొనసాగించాలన్నదే నా ఆకాంక్ష.

– మంగ వరప్రసాద్

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

అక్కిరెడ్డిపాలెం: తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి, బీరువాలోని బంగారు, వెండి వస్తువులను చోరీ చేశారు. ఘటనకు సంబంధించి గాజువాక క్రైం ఎస్ఐ మన్మథరావు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జీవీఎంసీ 68వ వార్డు మింది స్టూడియో లైన్‌లోని తమ సొంత ఇంట్లో జింక్ విశ్రాంత ఉద్యోగి ఈటి వెంకటరావు, రాజ్యలక్ష్మి నివసిస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు నాగశరత్ సంతు విజయవాడలోని ఫైబర్ నెట్‌లో జీఎంగా పని చేస్తున్నారు. వెంకట్రావు దంపతులు ఈ నెల 27న ఇంటికి తాళం వేసి విజయవాడలోని కుమారుడి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం ఇంటి ముందు శుభ్రం చేయడానికి వచ్చిన పనిమనిషి ముందు డోరు తాళాలు విరగ్గొట్టి ఉండటాన్ని గమనించి, ఇంటి పక్కవారితో పాటు నగరంలోనే ఉంటున్న వెంకట్రావు కుమార్తె సరితకు సమాచారం అందించింది. వెంటనే వచ్చిన సరిత గాజువాక క్రైం పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం అర్ధరాత్రి దొంగలు ముందు తలుపు తాళం విరగ్గొట్టి, లోపలికి ప్రవేశించి, వెనుక డోర్ నుంచి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. బెడ్‌రూమ్‌లోని బీరువాను, లాకర్ తెరిచి సుమారు రెండున్నర తులాల బంగారం, 30 తులాల వరకు వెండి, రెండు ఖరీదైన రిస్ట్ వాచ్‌లు, కొంత నగదు దొంగిలించినట్లు వెంకట్రావు కుమార్తె సరిత ఫిర్యాదులో పేర్కొన్నారు. క్రైం డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ శ్యామలరావు, సౌత్ ఏసీపీ త్రినాథ్, గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.